## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రవైద్య శిబిరం



పిట్లంలో కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులు

పిట్లం, అక్టోబర్ 13: మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కిషన్ నేత్రవైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో కంటి వైద్య నిపుణుడు హరికిషన్‌రావ్ 64 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందికి శస్త్రచికిత్స, 10 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి బోధన్ కంటివైద్యశాలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సమద్, అర్జున్, వైద్య సిబ్బంది సిద్ధిరామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీమాతో ఖాతాదారులకు ధీమా



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

పిట్లం, అక్టోబర్ 13: ఎస్‌బీఐలో ఖాతాదారులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా ధీమా కల్పిస్తున్నదని పిట్లం బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి అన్నారు. శుక్రవారం పిట్లం ఎస్‌బీఐలో చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన నసీమాబేగం అనే ఖాతాదారు ఇటీవల మరణించడంతో నామినీ అయిన మహ్మద్ మోసిన్‌కు రూ.2 లక్షల బీమా చెక్కును శుక్రవారం అందజేశారు. ఖాతాదారులకు బ్యాంకులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ సేవలందిస్తున్నామని మేనేజర్ తెలిపారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బాల్‌రాజ్, విజయ్, అబ్దుల్ అఫీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## నవరాత్రులకు మండపాలు సిద్ధం



అమ్మవారి విగ్రహాలను మండపాలకు తరలిస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 13: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుర్గా నవరాత్రులకు మండపాలు సిద్ధమవుతున్నాయి. శనివారం అమావాస్య వస్తుండడంతో నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను మండపాల వద్దకు చేరుస్తున్నారు. అమ్మవారి మండపాల ఏర్పాటుతో పాటు నవరాత్రులకు సంబంధించి భవానీమాల వేయడానికి యువకులు సిద్ధమవుతున్నారు. పూజాసామగ్రి, దుస్తుల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి.

# ముమ్మర తనిఖీలు

- కామారెడ్డి జిల్లాలో విస్తృతంగా నాకాబందీ
- చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచిన పోలీసులు
- సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు
- 24 గంటల పాటు నిరంతర గస్తీ




పిట్లంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

నిజాంసాగర్, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం ఇతరత్ర తరలించే వారిపై నిఘా పెంచారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల వద్ద కోడ్ ఉల్లంఘన జరగకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కోడ్ ఉల్లంఘిస్తున్న వారిపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, సరిహద్దులు, జాతీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో అక్రమంగా మద్యం, బెల్టుదుకాణాలు నిర్వహించకుండా ఆబ్కారీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ఈ నెల 9వ తేదీ నుంచి అమల్లోకి రాగా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలు చూపాలని ఈసీ పేర్కొన్నది.

**సరిహద్దులో కట్టుదిట్టం**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో భాగంగా అక్రమాల కట్టడికి సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. జుక్కల్ నియోజకవర్గంలోని సోపూర్-కర్ణాటక, సలాబత్‌పూర్-మహారాష్ట్ర వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జుక్కల్ పరిధిలో రెండు, బాన్సువాడ పరిధిలో ఒకటి మొత్తం మూడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఎస్ఎస్‌నగర్-నిజామాబాద్, మాచారెడ్డి-రాజన్న సిరిసిల్ల, భిక్కనూర్-నాగిరేడ్డిపేట-మెదక్, నిజాంసాగర్-సంగారెడ్డి, నస్రుల్లాబాద్-నిజామాబాద్ వద్ద అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిస్టికల్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, వీడియో ఫ్యూయింగ్, ఎంసీసీ, అకౌంటింగ్ బృందాలను సైతం ఏర్పాటు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 18 బృందాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 16 బృందాలు, బాన్సువాడ నియోజకవర్గంలో 16 బృందాలు, జుక్కల్ నియోజకవర్గంలో 17 బృందాలను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులతో పాటు ఏర్పాటైన సమీకృత తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు రవాణా, ఆబ్కారీ, అటవీ, వాణిజ్య పన్నుల శాఖల ఉద్యోగులు ఇక్కడ ఉంటారు. ఉమ్మడిగా తనిఖీలు చేపడుతూ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. నవంబర్ 30న పోలింగ్ ముగిశాక వీటిని తొలగించనున్నారు. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల అధికారులతో గతంలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమన్వయంతో ముందుకెళ్లాలని ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల అధికారులను సైతం ఆదేశించింది. రెండు రోజుల క్రితం మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ చెక్‌పోస్టు వద్ద రూ.2.40 లక్షలను పోలీసులు పట్టుకున్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

పిట్లం, అక్టోబర్ 13: మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి బ్రహ్మం ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల బృందానికి తనిఖీ సమయంలో సహకరించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**పెద్దకొడప్‌గల్‌లో..**

పెద్ద కొడప్‌గల్,అక్టోబర్ 13: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో శుక్ర వారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనాల్లో అక్రమంగా మద్యం,నగదు,బంగారం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు.



పెద్ద కొడప్‌గల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కోనారెడ్డి

## ఇంటి బాట





రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 25 వరకు దసరా సెలవులు ప్రకటించడంతో పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. విద్యార్థులను తీసుకొని వెళ్లడానికి తల్లిదండ్రులు రావడంతో పాఠశాల, బస్టాండ్‌లో సందడి నెలకొన్నది.

–పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 13

## కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 13: మండల కేంద్రానికి చెందిన ఎర్రమైసని సంతోష్(25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్ కడుపునొప్పి భరించలేక గురువారం రాత్రి 10 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

## నిజాం సాగర్ నీటిలో మునిగి ఒకరి మృతి

ఎల్లారెడ్డి, అక్టోబర్ 13: నిజాం సాగర్ నీటిలో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన పసుపుల సాయిలు (30) నిజాం సాగర్ నీటిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో చేపల వల చుట్టుకొని మునిగి పోయాడు. శుక్రవారం మృతదేహం నీటిలో కనిపించగా, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతుడికి 11 సంవత్సరాల కొడుకు ఉన్నారని చెప్పారు.



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న వీడీసీ చైర్మన్ రాజు, సభ్యులు

## ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

తాడ్వాయి, అక్టోబర్ 13: మండల కేంద్రానికి చెందిన ఆరుగురు యువకులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ మేకల రాజు మాట్లాడుతూ.. తాడ్వాయి గ్రామం నుంచి ఆరుగురు యువకులు ఒకే సారి పోలీస్ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉన్నదన్నారు. గ్రామంలోని యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువకులు వారికి నచ్చిన రంగంలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవులు, గ్రామ పెద్దలు భరత్‌రెడ్డి, రాంచంద్రం, ప్రతాప్‌రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.